క్లుప్తంగా

విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది



చంద్రయాన్ 3 ప్రయోగాన్ని తిలకిస్తున్న విద్యార్థులు

కేశంపేట: చంద్రయాన్ 3 ప్రయోగాన్ని ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ఫ్యానెల్)లో పాఠశాల విద్యార్థులు తిలకించారు. మండలంలోని కొత్తపేట, పాపిరెడ్డిగూడ, కేశంపేట, కొండారెడ్డిపల్లి, వేములనర్వ గ్రామాల్లో జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీకి నెట్ కనెక్టు చేసి విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రయోగాన్ని చూయించారు. చంద్రయాన్ 3 విజయవంతం కావడంతో విద్యార్థులు విక్టరీ సింబల్‌తో సంబరాలు చేసుకున్నారు. విద్యార్థులు ప్రయోగాలను తిలకించడం వల్ల వారిలో సృజనాత్మకత పెరుగుతుందని మండల విద్యాధికారి మనోహర్ అన్నారు. ఈ కార్యక్రమాల్లో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాససాగర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

మండల వ్యవసాయ అధికారి శిరీష



పంటను పరిశీలిస్తున్న ఏఓ

కేశంపేట: రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారి శిరీష అన్నారు. మండలంలోని వేముల నర్వ గ్రామ శివారులోని వ్యవసాయ భూముల్లో రైతులు సాగుచేస్తున్న పంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు ఎరువుల వాడకాన్ని తగ్గించి, జీవన ఎరువులను వాడుకోవాలని సూచించారు. జీవన ఎరువులు వాడకం వల్ల పంట సాగులో ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి వినయ్, రైతులు శ్రీశైలం, సుధాకర్, శేఖర్, యాదయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



అర్ధనగ్న ప్రదర్శనతో కార్మికుల నిరసన

కేశంపేట: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రంలో నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. శుక్రవారం 8వ రోజు సమ్మెలో భాగంగా అర్ధనగ్న ప్రదర్శనను కార్మికులు కొనసాగించారు. ప్రభుత్వం తమ సమస్యలను త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంచందర్, రవి, రామస్వామి, జంగయ్య, రాములు, పరేషా, రోషయ్య, పద్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐగా వరప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్ఐ బీఎస్ఎస్ వరప్రసాద్

కేశంపేట: కేశంపేట నూతన ఎస్ఐగా బీఎస్ఎస్ వరప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కేశంపేట పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న ధనుంజయ్ మేడ్చల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో గచ్చిబౌలి ట్రాఫిక్ సెక్టార్‌లో విధులు నిర్వహిస్తున్న వరప్రసాద్‌ను నియమించారు. శుక్రవారం ఎస్ఐ ధనుంజయ్ నుండి బాధ్యతలు స్వీకరించారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడేందుకు అందరూ సహకరించాలని బీఎస్ఎస్ వరప్రసాద్ కోరారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

షాద్‌నగర్: పట్టణంలో పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళా కార్యక్రమాన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి కోరారు. శ్రేయాన్ కన్సల్టీ సర్వీస్ వారి సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు షాద్‌నగర్‌లోని ఈడెన్ ఫంక్షన్ హాల్‌లో రెండో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఐదువేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించాల నే లక్ష్యంతో మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు.. పొంచి ఉన్న ప్రమాదాలు

- వర్షాకాలంలో పొంచి ఉన్న ప్రమాదాలు
- విద్యుదాఘాతానికి గురవుతున్న ప్రజలు, మూగజీవాలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు
- భయాందోళనలో ప్రజలు



పెంజర్ల రోడ్డులో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారులు స్పందించడ లేదు. చాలా గ్రామాల్లో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. జనావాసాలు, రోడ్ల పక్కనే ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల వల్ల విద్యుదాఘాతానికి గురయి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు మండలంలో తరుచూ సంభవిస్తున్నాయి. అయినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే కొన్నిచోట్ల పశువులు, వీధి కుక్కలు కరెంట్ షాక్‌తో మృతిచెందాయి. ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే కంచెలు ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తున్న అధికారుల హామీలు వాస్తవరూపం దాల్చడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ఇన్ముల్‌నర్వ నుంచి కొడిచర్ల గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇప్పటికే విద్యుదాఘాతానికి గురై పశువులు, మేకలు మృతి చెందాయి. నిత్యం ఈ రోడ్డుపై నుంచి వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఏమాత్రం వాహనదారులు అజాగ్రత్తగా వ్యవహరించిన ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. నారాయణగూడ కాలనీ మటన్‌మార్కెట్ రోడ్డులో ఇళ్ల మధ్యనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉంది. కాలనీలోని చిన్నారులు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోనే ఆటలు ఆడుకుంటుంటారు. వర్షాలు కురిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కంచెల ఏర్పాటుకు కృషి



ఇళ్ల మధ్యలో, రోడ్ల పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడానికి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. ప్రమాదాల నివారణకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తా.

లావణ్య, మున్సిపల్ చైర్‌పర్సన్, కొత్తూరు

పరిగి రోడ్డుకు మరమ్మతులు చేయాలి



రోడ్డుపై బైఠాయించిన బీజేపీ నేతలు

బీజేపీ నేతల డిమాండ్

షాద్‌నగర్: గుంతలమయంగా మారిన పరిగి రోడ్డుకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు మఠం రుషికేష్ ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పరిగి రోడ్డు సరిగా లేక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టడం లేదని విమర్శించారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు చోద్యం చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డు కూడా అధ్వానంగా ఉందని, పాత జాతీయ రహదారి విస్తరణలు పనులు వెంటనే ప్రారంభించాలని, లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, మిథున్‌రెడ్డి, డాక్టర్ విజయ్‌కుమార్, మురళీ, మోహన్‌సింగ్, వంశీకృష్ణ, అశోక్, లక్ష్మీ కాంత్‌రెడ్డి, శ్రావణ్, వెంకటేష్, శ్రీనివాస్, సుధాకర్, శివకుమార్, శ్యాం సుందర్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

మర్రి ఊడల మధ్య మలుపు 'సూచిక'

మొయినాబాద్: హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి అసలే ప్రమాదాలకు నిలయం. ప్రతి రెండు మూడు రోజులకు ఓ ప్రమాదం జరుగుతూనే ఉంటుంది. ఈ రహదారిపై మూలమలుపులు అధికంగా ఉన్నాయి. మలుపులను సూచించేందుకు అక్కడక్కడ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. కానీ సూచిక బోర్డుల నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గేటు, అప్పారెడ్డిగూడ గేటు మధ్య హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై మూల మలుపు వద్ద ఏర్పాటు చేసిన మలుపు సూచిక బోర్డు మర్రి చెట్టు ఊడల మధ్య చేరింది. రహదారిపై వెళ్లే వాహనదారులకు కనిపించకుండా ఉన్నప్పటికీ ఈ సూచిక బోర్డును అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు.



మలుపు సూచిక బోర్డు

ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డును సరైన పద్ధతిలో ఏర్పాటు చేయాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా సైదులు



ఇన్‌స్పెక్టర్ సైదులును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

చేవెళ్ల: చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదులు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం ఆయనను చేవెళ్ల బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి అత్తెల్లి అనంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్‌కు స్వాగతం పలికారు. చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన వాసుకు ఏసీపీగా పదోన్నతి కల్పించారు. దీంతో ఈ స్థానం ఖాళీ అయింది. అయితే చేవెళ్లకు గతంలో ముత్తుయాదవ్‌ను బదిలీ చేశారు. ఆయన ఇక్కడ చార్జ్ తీసుకోకుండానే మరో చోటుకు బదిలీ చేసుకోవటంతో ఇక్కడికి సైదులను నియమించారు.

చిన్న చూపు తగదు

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్

షాబాద్: పంచాయతీ కార్మికుల డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలో మోకాళ్లపై నిలబడి పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ తొమ్మిది రోజులుగా కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. వారిని బెదిరింపులకు గురిచేస్తూ సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. జీఓ 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, 8 గంటలు పనిదినాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ షాబాద్ మండల కార్యదర్శి నరసింహ, పంచాయతీ కార్మికులు తదితరులున్నారు.

జీపీ కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి పట్టవా..

మొయినాబాద్ రూరల్: పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు కె.రామస్వామి విమర్శించారు. కార్మికుల సమ్మెకు సీపీఐ సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ జీపీ కార్మికులు సమ్మెను విచ్ఛినం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో పాటు ప్రమాదబీమా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ పార్టీ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా మహిళా సమైక్య కార్యవర్గ సభ్యులు మంజుల, బీకేఎంయూ జిల్లా అధ్యక్షులు అంజయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మల్లేష్, మండల సీఐటీయూ కన్వీనర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



షాబాద్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

హెడ్ మాస్టర్ నర్సింహ్మ నాయక్

మొయినాబాద్ రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల హెడ్ మాస్టర్ నర్సింహ్మనాయక్ తెలిపారు. అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధి కోసం ప్రభుత్వంతో పాటు వాటర్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకులు, సోలార్, బాత్‌రూమ్‌లు, ఇంకుడు గుంతల ఏర్పాటుతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు వాటర్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో 90 శాతం నిధులు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు.

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులకు సదావకాశం

షాద్‌నగర్ రూరల్: ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు అవకాశం కల్పిస్తునట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. బీఎస్సీ(ఎంపీసీ, ఎంఎస్‌సీ, ఎంబీజడ్‌సీ, బీజడ్‌సీ, బీకాం(కంప్యూటర్స్) కోర్సుల్లో మొదటి సంవత్సరంలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులు దోస్త్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులు ఈ నెల 20 వరకు వరకు అన్ని సర్టిఫికెట్లు(రెండుసెట్లు), 4 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్, దోస్త్ ఐడీని పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న నాగర్‌కర్నూల్ మహిళా డిగ్రీ కళాశాలలో అందజేయాలని సూచించారు. మరిన్ని వివరాలకోసం 9390357980, 7995660881 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం. ప్రభులింగం డిమాండ్ చేశారు. మండలంలోని ఆలూరు గ్రామంలో రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన శుక్రవారం రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతులకు ఈ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. రుణమాఫీ ఒకేసారి లక్ష రూపాయలు మాఫీ చేయాలన్నారు. గ్రామాల్లో రైతు సంఘాలను గ్రామ శాఖల ద్వారా బలోపేతం చేయాలని సూచించారు. రైతాంగ సమస్యలను పరిష్కరించేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. రైతులంతా కలిసి కట్టుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సుధాకర్‌గౌడ్, రైతు సంఘం మండల నాయకులు సూటి నర్సింహులు, గ్రామ కమిటీ నాయకులు దేవగోని మల్లేశ్, మల్లేశ్, పోశయ్య, శ్రీనివాస్, జంగయ్య, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత ఉపాధ్యాయులదే

జిల్లా విద్యాధికారి సుసిందర్‌రావు

మొయినాబాద్ రూరల్: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా విద్యాధికారి సుసిందర్‌రావు అన్నారు. మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను సుసిందర్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందాల్సిన సదుపాయాల గురించి ఆరా తీశారు. విద్యార్థుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యను బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలకు సంబంధించిన ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు చక్కగా చదువుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎం.వెంకటయ్య, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ హరీషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి సుసిందర్‌రావు

అర్హులకే 'దళితబంధు' ఇవ్వాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలాచారి



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రభుత్వం అర్హులైన నిరుపేద దళితులకే దళితబంధు ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలాచారి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని మొగిలిగిద్ద గ్రామంలో బీజేపీ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు నర్సింహ్మ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం భూపాలాచారి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలకే దళితబంధు ఇస్తున్నారని ఆరోపించారు. సీఎం కేసీఆర్ దళితులను ఓటుబ్యాంకు కోసమే వాడుకుంటున్నారని విమర్శించారు. దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితుల అభ్యున్నతికి బీఆర్ఎస్ ప్రభుత్వం పాటుపడటం లేదని ఆరోపించారు. ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేసీఆర్‌ను గద్దె దించేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల అధ్యక్షుడు వెంకటేష్, నాయకులు కృష్ణయ్య, సురేష్, భరత్, రాములు, యాదయ్య, రాజు, నవీన్, గిరి, సురేష్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను ఓడించండి..

కేశంపేట: దళితబంధు పథకాన్ని ప్రతి దళితుడికి ఇవ్వాలని బీజేపీ మండల అధ్యక్షుడు పసుల నర్సింహయాదవ్ డిమాండ్ చేశారు. దళితులందరూ వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను ఓడించాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే దళితుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రఘురాంగౌడ్, నరేందర్‌రెడ్డి, యూగందర్, మహేశ్, వేణు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు పేరుతో..

కొత్తూరు: బీఆర్ఎస్ ప్రభుత్వం దళితబంధు పేరుతో దళితులను మరో సారి మోసం చేస్తోందని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ నర్సింహా గౌడ్ తెలిపారు. హుజురాబాద్ ఎన్నికల సమయంలో దళితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. దళితబంధును కేవలం ఎన్నికల కోసం వాడుకొని దళితులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు మల్‌రెడ్డి మహేందర్ రెడ్డి, యువ మోర్చా జిల్లా కార్యదర్శి రణధీర్ గౌడ్, నాయకులు రమేష్, కిరణ్, నవీన్, మధు సూదన్, శేఖర్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి

కొందుర్గు: దళితబంధు నిజమైన పేద దళితులకు ఇవ్వాలని బీజేపీ నాయకులు శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ నేత అందె బాబయ్య హాజరై మాట్లాడారు. దళితులకు దళిత బందు ఇస్తే వారు ఆర్థికంగా రాణిస్తారని అన్నారు. ఓట్ల కోసం దళితబంధు, బీసీబంధు అంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేయడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షులు కురుమయ్య, నాయకులు మల్లేష్, హరీష్, బీమయ్య, శ్రీను, నవీన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీలను ఎండగట్టాలి

బొలిగిద్ద సత్యనారాయణ



కేసీఆర్, కేటీఆర్, కవిత దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మొయినాబాద్ రూరల్: బీఆర్ఎస్, బీజేపీలను ఎండగట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బొలిగిద్ద సత్యనారాయణ పిలుపునిచ్చారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు చేసిన నిరాధారమైన ఆరోపణలకు నిరసనగా హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి తోల్‌కట్ట చౌరస్తాలో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత దిష్టి బొమ్మలను కాంగ్రెస్ నేతలు దహనం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ రేవంత్ వ్యాఖ్యలను వక్రీకరించారని తెలిపారు. కాంగ్రెస్ ఎదుగుదలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ పార్టీ నేతలు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని గుర్తుచేశారు. రైతులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్, కిసాన్‌సెల్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మేకగూడం భిక్షపతి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జంగయ్య, సీనియర్ నాయకులు భుజంగరెడ్డి, మహమూద్ పటేల్, అమీర్‌ఖాన్, శంకరయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు

మొయినాబాద్ రూరల్: పురపాలక శాఖమంత్రి కేటీఆర్‌కు మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. శుక్రవారం చేవెళ్ల షాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రిని కలిసేందుకు మండలం నుంచి ముఖ్య నేతలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా చేవెళ్లలో కేటీఆర్‌కు ఎమ్మెల్యే కాలె యాదయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, స్వాగతం పలికారు. మంత్రిని కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు కాలె శ్రీకాంత్, సర్దార్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రావూఫ్, మాజీ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

చేవెళ్లలో..

చేవెళ్ల: నియోజకవర్గంలోని షాబాద్ మండలంలోని చందనవెళ్లి ఇండస్ట్రియల్ పార్కులో నూతన కంపెనీ యూనిట్ల ప్రారంభోత్సవానికి ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రావటంతో ఆయనకు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. మంత్రికి శాలువ కప్పి పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. మండల నాయకులను కేటీఆర్‌కు పరిచయం చేశారు.



కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు

సర్పంచ్ జంగయ్య



పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ జంగయ్య

షాబాద్: పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మల్లారెడ్డిగూడ గ్రామ సర్పంచ్ చందిప్ప జంగయ్య తెలిపారు. శుక్రవారం షాబాద్ మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో రూ.20 లక్షల రూపాయలతో పంచాయతీ నూతన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాన్నారు. మారుమూల గ్రామాలను అభివృద్ధి చేసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రైతులకు పెట్టుబడులు, రైతుబీమా పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆడపిల్లలకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను తీసుకువచ్చి, ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచారన్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ తదితర పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సర్పంచ్ పరిగి గణేశ్‌గౌడ్, వార్డు సభ్యులు తదితరలున్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

షాబాద్: షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ, తాళ్లపల్లి, రుద్రారం తదితర గ్రామంలో శుక్రవారం బోనాలు ఉత్సవాలను ప్రజలు ఎంతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని ఊరేగింపుగా తరలివచ్చి.. గ్రామ దేవతలకు నైవేద్యాన్ని సమర్పించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, సర్పంచ్‌లు ఈదుల కృష్ణగౌడ్, పెంటయ్య, స్వర్ణలత, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటయ్య, కుమార్, రమేష్ పంతులు, రాజు, మాధవచారి తదితరులున్నారు.

నందిగామ మండలంలో..

నందిగామ: మండల పరిధిలోని జంగోనిగూడలో శుక్రవారం మైసమ్మ, పోచమ్మ బోనాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో గ్రామంలో పెద్ద ఎత్తున బోనాలను ఊరేగించారు. అనంతరం బోనాల నైవేద్యాన్ని అమ్మవార్లకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



రుద్రారంలో బోనాల ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి

కొత్తూరులో..

కొత్తూరులో మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కృష్ణ వేణి పాఠశాలలో విద్యార్థులు చేసిన బోనాలు పలువురిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి, సంధ్యారెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.